# చెడు కాలాల్లో బతుకు కొనసాగించడం ఎలా?

## (1 సమూ. 18-23)

గుహలో చాలా చలిగాను, తడిగాను ఉంది. కప్పుమీద చెమ్మ కూడుకుని గట్టిగాను, చల్లగాను ఉన్న నేలమీద పడుతోంది. దావీదు తన పైవస్త్రాన్ని తన భుజాలమీదికి దగ్గరగా ఒత్తుకుని, వణకుతున్నాడు. అతని కడుపులో ఆకలి సొద ఎక్కువైయ్యింది. అత్యధికమైన చలి అతని శరీరంలోనే గాక అతని అంతరంగంలో కూడా పుట్టుకొస్తోంది; భయంకరమైన ఆ ఆకలి ఆహారం కొరకు కాదు, దయకొరకు, అక్కర కొరకు. దావీదు చేసిన నేరం, ఒక గొప్ప పనిని చేసి దేవునియందు నమ్మికయుంచుటే, కాని సౌలుయొక్క ప్రేమ మతి భ్రమించిన అసూయగా మారింది. ఇప్పుడు దావీదు ఒక వేటాడబడుతున్న జంతువు - ఒంటరిగాడైపోయాడు.

కటిక చీకటిగా ఉన్న గుహలో, దావీదు పాడనారంభించాడు. గట్టిగా, తేటైన స్వరము, గాలిలా మృదువైనదై ఉద్వేగంతో కూడి, ఆ గుహను నింపింది. అతడు తన ఒంటరితనాన్ని, తన ప్రార్థనలను తన విశ్వాసాన్ని పాడాడు. అదుల్లాము లోయలో ప్రతిధ్వనించిన పాట 142వ కీర్తనగా మన కొరకు భద్రపరచబడింది. ఆ గుహలోని శూన్యత, దావీదు హృదయము యొక్క అపేక్ష అనేక సంవత్సరాలుగా ఇప్పటికీ ప్రతిధ్వనిస్తోంది:

> నేను ఎలుగెత్తి యెహోవాకు మొరలిడుచున్నాను;
> ఎలుగెత్తి యెహోవాను బతిమాలుకొనుచున్నాను.
> బహు వినయముగా ఆయన సన్నిధిని నేను మొఱ్ఱపెట్టుచున్నాను;
> నాకు కలిగిన బాధ ఆయన సన్నిధిని తెలియజెప్పుకొనుచున్నాను....
> నా మార్గము నీకు తెలియును
> నన్ను పట్టుకొనుటకై నేను నడువవలసిన త్రోవలో.
> చాటుగా పగవారు ఉరినొడ్డుచున్నారు.
> నా కుడిప్రక్కను నిదానించి చూడుము;
> నన్నెరిగినవాడు ఒకడును నాకు లేకపోయెను;
> ఆశ్రయమేదియు నాకు దొరకలేదు;
> నాయెడల జాలిపడువాడు ఒకడును లేడు (1-4 వచనాలు).

మనలో ఎక్కువమంది దావీదుతో పోల్చుకుంటారు. నీ జీవితంలోనికి చెడ్డ దినములు వచ్చియుండవచ్చు - లక్ష్యపెట్టేవారు లేరని నీవు అనుకోవచ్చు. అది భయం కలిగిస్తుంది, కదా?

మనం అడిగే ప్రశ్నేమంటే, "చెడ్డ కాలాల్లో మన బతుకు కొనసాగించడం ఎలా?" ఈ పాఠంలో రాజైన సౌలు తరుముతూ ఉండగా దావీదు పారిపోతున్న సమయాన్ని అధ్యయనం చేద్దాం. తన బతుకునెలా కొనసాగించాడో చూచి మనం కూడా అలాంటి

సమయంలో ఎలా ఉండాలో తెలుసుకుందాం. చెడు కాలాల్లో మన బతుకు కొనసాగించ డానికి ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో అన్న విషయాన్ని గురించి 10 అంశాలను గమనిద్దాం.

## చెడు కాలాలు వచ్చినందుకు ఆశ్చర్యపడవద్దు (18:1-20:42)

"వద్దు" అనే దానిలో మొదటిది, "చెడు కాలాలు వచ్చినందుకు ఆశ్చర్యపడవద్దు." దీన్ని వివరిస్తాను: "చెడు కాలాలు వచ్చినందుకు ఆశ్చర్యపడవద్దు, నీవు సాధ్యమైనంత మంచి పని చేస్తున్నప్పుడు కూడా" దీన్ని మరొకసారి వివరిస్తాను: "చెడు కాలాలు వచ్చినందుకు ఆశ్చర్యపడవద్దు, నీవు నీ శ్రేష్ఠమైనవి జరిగిస్తున్నప్పుడు సహితము – మార్గంలో ప్రతి అడుగులో దేవుడు నీతో ఉన్నా కూడా."

ఈ ప్రతిపాదన కొందరికి వింతగా ఉండవచ్చు. "నిశ్చయంగా దేవుడు సంతోషించే మంచి పనిని చేస్తే అతనికి చెడ్డ దినాలు సంభవించవు" అని మనం అనుకోవచ్చు! నా ప్రతిపాదన సత్యమే సుమీ. దావీదు జీవితం దీన్ని సత్యమని రుజువు చేస్తుంది.

మన గత పాఠంలో, దావీదు పట్ల యోనాతాను స్నేహ బంధమునకు సంబంధించిన కొన్ని లేఖన భాగాలను చూచాం. మనం వెనుకకు వెళ్లి చూస్తే, దావీదు వేసిన ప్రతి అడుగులో దేవుడు అతనితో ఉన్నా, చెడు కాలాలు అతనికి వచ్చాయి.

దావీదు గొల్యాతును చంపిన తరువాత, రాజ కుటుంబంలో తానూ ఒకడుగా ఉండటానికి ఆహ్వానించబడిన సంగతి నీకు జ్ఞాపకమే కదా. సౌలు అతని శ్రేయోభిలాషి, అభిమాని. రాజు నిరుత్సాహ సమయంలో సౌలుకొరకు దావీదు అతని కోసం పాడుతునే ఉన్నాడు. అతడు సౌలుకు ఆయుధములు మోయువాడు, దేహ సంరక్షకుడు. "దావీదు గొల్యాతును చంపగలిగినట్లయితే, అతడు యింకెవనినైనా సంబాళించగలడు" అని సౌలు తలచాడు. సౌలు సైన్యంలో దావీదు ఒక దళపతిగా చేయబడ్డాడు. పేరు ప్రఖ్యాతులు కలిగి అందరికి అతడు ఎరుకైనవాడై యున్నాడు.

అప్పుడు, ఏదియెలాగున్నా, స్త్రీలు పాడిన పాట సౌలుకు అసూయను రేకెత్తించింది: "సౌలు వేలకొలదియు, దావీదు పదివేలకొలదియు (శత్రువులను) హతము చేసిరి" (18:7). ఈ పాటలో సౌలుకు అమర్యాదలేదు. "వేలు" మరియు "పదివేలు" అనేవి "గొప్ప సంఖ్యను" అని చెప్పే కవితాత్మక పదాలు. యూదుల కావ్యాల్లో సమాంతరంగా పోల్చడానికి ఈ రెండు పదాలు గొప్పవే అంటే ఒక్కటే.[1] వాస్తవంగా, తన పేరు ముందు పలకబడడం ద్వారా సౌలుకు అధికమైన గౌరవం కలిగింది. సౌలు అనుభవజ్ఞుడై పరిణతి కలిగినవాడైతే, దీన్ని అతడు గ్రహించియుండేవాడే. అయితే, సౌలు అనుభవ జ్ఞానం, స్థిరత్వం లేనివాడని మనం చదువుతాం:

> ఆ మాటలు సౌలునకు ఇంపుగా నుండనందున అతడు బహు కోపము తెచ్చుకొని – వారు దావీదునకు పదివేలకొలది అనియు, నాకు వేలకొలది అనియు స్తుతులు పాడిరే;

రాజ్యము తప్ప మరి ఏమి అతడు తీసికొనగలడు అనుకొనెను. కాబట్టి నాటనుండి సౌలు దావీదుమీద విషపు చూపు నిలిపెను (18:8, 9).

రాజు, అర్థరహితమైన భయముతో నిండి (అధ్యాయం 18లో ముమ్మారు సౌలు దావీదు అంటే భయపడినట్టు చెప్పబడింది[2]). పిచ్చివాడుగా మారాడు. దావీదు సితారా వాయించుచుండగా, రెండు మార్లు బల్లెముతో అతనిని గోడకు బిగించ చూచాడు. అతనిని ఘనపరచినట్టు నటించుతూ, సైన్యంలో గొప్ప పదవికి అతనిని పెంచాడు, నిజానికి అతడు యుద్ధంలో చస్తాడనే నిరీక్షణతోనే ఆ పనిని చేశాడు.[3]

గొల్యాతును చంపినవానికి తన కుమార్తెనిచ్చి పెండ్లి చేతునని చేసిన వాగ్దానం విషయంలో అతడు పలు పన్నాగాలను పన్నాడు.[4] తన పెద్ద కుమార్తెయైన మేరబును దావీదుకు యిస్తానన్నాడు. దావీదు దానికి తాను యోగ్యుడను కానని మర్యాదగా చెప్పినందుకు, సౌలు మేరబును మరి ఒకనికి యిచ్చాడు.[5] తన చిన్న కుమార్తెయైన మీకాలు దావీదును ప్రేమించిన సంగతిని సౌలు తెలుసుకుని, "ఆమె అతనికి ఉరిగా నుండునట్లు ఆమెను అతని కిత్తునని తలంచాడు" (18:21). "ఉరి" అనేది, ఎరను తినే సమయంలో వలలో చిక్కించుకునేది అనే హెబ్రీ పదంనుండి తర్జుమా చేయబడింది. ఎలుక బోనుకు మీకాలు జున్నువంటిది.

సౌలు మీకాలును దావీదుకు యివ్వాలనుకున్నప్పుడు, "నేను దరిద్రుడనై యెన్నికలేని వాడనై" యున్నానని అతడు ప్రత్యుత్తరమిచ్చాడు (18:23). అంటే, కన్యా శుల్కాన్ని చెల్లించలేనని[6] భావం. దావీదు గొల్యాతును చంపినందున సౌలు అతని ధనవంతునిగా చేసి, కన్యాశుల్క సమస్య లేకుండగనే తన కుమార్తెలలో ఒకతెను అతనికిచ్చి వివాహం చేసి ఉండవలసింది (1 సమూ. 17:25) – అయితే సౌలు తన మాట నిలుపుకోలేదు, ఇప్పుడు సౌలు "నాకు డబ్బుతో నిమిత్తము లేదు, నాకు కావలసినదంతా వందమంది ఫిలిష్తీయులను[7] చంపినట్టు రుజువు మాత్రమే." ఆ ప్రయత్నంలో దావీదు చంపబడతాడని సౌలు నిరీక్షించాడు. దావీదు సాహస స్వభావానికి అది నచ్చినట్టుంది. అతడును అతని మనుష్యులును ఫిలిష్తీయుల మీదపడి, వందమంది మాత్రమే కాదు రెండువందల మందిని చంపినట్టు రుజువు తెచ్చాడు. అందువలన గత్యంతరం లేక సౌలు మీకాలును దావీదునకు యిచ్చాడు.

సౌలు కలవరం మెల్లిగా అధికమౌతుంది. మొదట యోనాతాను దావీదు పక్షంగా మాట్లాడాడు; ఇప్పుడు మీకాలు సహితము అతని పక్షమే! మతి చలించిన సౌలు కండ్లలో, తన పిల్లలలో యిద్దరిని దావీదు తనకు వ్యతిరేకముగా తిప్పినట్లున్నాడు. అది సౌలు భరించగలదానికంటె మించినది. అందువలన సౌలు, "యెల్లప్పుడును దావీదు మీద విరోధముగా ఉండెను" (18:29). "మిగిలిన తన దినములన్నిటను అతడు వానికి శత్రువుగా ఉండెను" అని NIV అంటుంది. నిన్ను చంపాలనుకునే మామను నీవు ఊహించగలవా? (మీరు మీ తలలు ఎందుకు ఊపుతున్నారు?)

దావీదును చంపుడని యోనాతానుకును, తన అధిపతులకును సౌలు ఆజ్ఞాపించగా, దావీదుపట్ల యోనాతాను చేసిన విన్నపమునుబట్టి, దావీదును తుంచివేయు అతని

ప్రయత్నములో కొంత ఉపశమనము జరిగినట్టు గత పాఠంలో చూచాం. దావీదును చంపనని సౌలు చేసిన వాగ్దానం కొద్ది కాలంలోనే మరచినవాడై, మరల తన బల్లెమును దావీదుపైకి విసిరాడు. 1 సమూ. 19:10 యిలా అంటుంది: "దావీదు ఆ రాత్రియందు తప్పించుకొని పారిపోయెను." అటు తరువాత రమారమి పది సంవత్సరాలకు పైగా "పారిపోయెను," "తప్పించుకొనిపోయెను" అనే మాటలే అతని జీవితంలో మాటిమాటికి కన్పిస్తాయి.[8] దావీదు చేతనైన దానినంతటిని చేస్తున్నాడు, దేవుడు అతని ఆశీర్వదించాడు, అయినా అతనికి చెడు కాలములే ఎదురౌతున్నాయి.

దావీదు మొదటిగా తన యింటికి పారిపోయి, జరిగిన దానిని తన భార్యయైన మీకాలుకు తెలిపాడు.[9] దావీదుకంటె తన తండ్రిని బాగుగా ఎరిగినదై, అతనికి జాగుచేసే సమయం లేదని తన భర్తకు చెప్పింది. తన యింటిమీద కాపలా ఉన్న విషయం నిశ్చయంగా తెలిసింది కనుక,[10] కిటికీగుండ దావీదును మీకాలు దించింది.[11] దావీదు మరెన్నడు మీకాలుయొక్క ప్రేమకుగాని, తన గృహానికిగాని తిరిగి రాలేకపోయాడు.

దావీదుకు వ్యవధిని సమకూర్చడానికి గాను, పెద్ద విగ్రహాన్ని[12] మీకాలు పడకమీద ఉంచి, మేక వెంట్రుకలను తలగడవైపు పెట్టి, పడక వస్త్రాలతో దాన్ని కప్పింది. దావీదు జబ్బుపడి ఉన్నాడని సౌలుయొక్క వర్తమానికులకు ఆమె తెలిపింది. ఆమె చేసిన మోసం కనుగొనేలోపుగా, దావీదు సమూయేలుతో రామా వద్ద వున్నాడు. సమూయేలు దావీదును నాయోతుకు,[13] ప్రవక్తల కాలనీకి, తీసికొని వెళ్లాడు, దావీదుకు అక్కడ ఆశ్రయం దొరికింది. అతడు అక్కడ ఉన్న సంగతి సౌలునకు తెలిసి, హంతకుల గుంపును పంపాడు, కాని దేవుడు దావీదును కాపాడాడు. సౌలు పంపిన జనులు ప్రవక్తల వద్దకు వచ్చినప్పుడు, దేవుడు తన ఆత్మను వారిమీదికి పంపాడు, వారు ప్రవచింప నారంభించారు. సౌలు మరి రెండు గుంపులను పంపాడు – అదే విధమైన ఫలితంతో.

ఈ దృశ్యం కొంత తమాషాగా కన్పిస్తుంది. ఒక పన్నిద్దరు దుండగులు లెదర్ జాకెట్లతోను, ఇత్తడి గోళ్లతోను, సైకిలు చెయిన్లతోను సంఘ ఆరాధనలోనికి సువార్తికుని చంపవచ్చారట. అప్పుడు POW వింతైన దృశ్యం వారి ముఖాలమీదికి వచ్చి, వారు పాటల పుస్తకాలు తీసికొని బిగ్గరగా – "ఆశ్చర్యకరమైన కృప" అని పాడనారంభించిన దృశ్యంతో దీన్ని పోల్చవచ్చు.

ఏమి జరిగిందో సౌలు ఊహించలేకపోయాడు, గనుక అతడు సోదె చూడ వచ్చాడు. అతడు ప్రవక్తలను సమీపించినప్పుడు, దేవుడు తన ఆత్మను పంపి సౌలును నిస్సహాయునిగా చేశాడు. హాస్యాస్పదమైన పరిస్థితిలో సౌలు వస్త్రహీనుడుగా పడియుండి ఒక రాత్రి పగలు అలాగే ప్రవచించుతున్నాడు (19:24)![14] రామా క్షేమకరమైంది కాదని తేలిపోయింది; దావీదు మరోసారి పారిపోవలసి వచ్చింది. తన ఉపదేశకుడైన సమూయేలును అతడు యిక ఎన్నడూ చూడబోవుటలేదు. చెడు కాలాలు యింకా చెడ్డవిగా మారిపోయాయి.

గత పాఠంలో మనం గుర్తించినట్టు, దావీదు యోనాతాను వద్దకు పారిపోతాడు. తన స్నేహితునితో మాట్లాడిన మాటల్లో అతని స్వరములోని నిస్పృహను ఊహించు, "–నేను ఏమి చేసితిని? నేను చేసిన దోషమేమి?" (20:1). నీకు చెడుకాలములు వచ్చినప్పుడు, "దీనికి తగియుండడానికి నేనేమి చేసితినని?" నీవు కూడా విలపించవచ్చు.

ఇంతకు విషయమేమంటే, సౌలుయొక్క ద్వేషానికి పాత్రుడైయుండడానికి దావీదు ఏ తప్పిదం చేయలేదు – అయినా చెడు కాలాలు వచ్చాయి.

సౌలు యోనాతానును చంపాలనుకున్నప్పుడు ఏ అనుమానమూ మిగలలేదు. దావీదు బ్రతికియున్నంత కాలము సౌలు విశ్రమించలేడు. ఇద్దరు స్నేహితులు కన్నీళ్లతో వేరైపోయారు. చెడు కాలాలు మరింత చెడుగా మారిపోయాయి.

మరలా నేను నొక్కి చెప్పేదేమంటే (1) దావీదు అతి శ్రేష్ఠమైన దానిని శారీరకంగాను, ఆత్మసంబంధంగాను జరిగిస్తున్నాడు. మరియు (2) తాను జరిగించిన దానియంతటిలో దేవుడు అతనికి తోడైయున్నాడు. అయినా చెడ్డ కాలాలు వస్తునే ఉన్నాయి. తన హృదయానుసారుడైన వానికే యిలాటివి సంభవించినట్లయితే, అవి నీకు సంభవించ వచ్చు. నీవు పెద్దవో, పరిచారకుడవో, సువార్తికుడవో, లేక బైబిల్ క్లాస్ టీచరువో–నీ బిడ్డలు డ్రగ్స్ వేసికొని నీ హృదయాన్ని భగ్నం చేయవచ్చు. నీవు ప్రేమతో కూడిన క్రైస్తవ భార్యవో, భర్తవో నీ వివాహం సజావుగా ఉండాలని నీవు సకల ప్రయత్నాలు చేసి ఉండవచ్చు, కాని నీ జోడు నిన్ను ఎడబాయవచ్చు. నీవు యథార్థమైన క్రైస్తవ వ్యాపారివి కావచ్చు, నీ వ్యాపారం లాభకరంగా ఉండడానికి అన్ని ప్రయత్నాలు చేసినా, నీవు సమస్తాన్ని పోగొట్టుకోవచ్చు. నీవు నమ్మకమైన క్రైస్తవుడవై యుండవచ్చు – దేవునియందు నీ హృదయాన్ని ఆత్మను నిలిపియుండవచ్చు – కాని “నీవు బ్రతికేది యింకా మూడు నెలలేనని” డాక్టరు చెప్పవచ్చు.

నన్ను అపార్థం చేసికోవద్దు. నమ్మకమైన క్రైస్తవులుగా మంచి వివాహము, ఆనందదాయకమైన గృహము, ఆర్థిక భద్రత, మంచి ఆరోగ్యము ఉండే అవకాశాలు మనకు ఉంటాయి. అయినా, మనం అర్థం చేసికోవలసిందేమంటే, దేవుని నమ్మకమైన పిల్లలు సైతం చెడు కాలాలు తాకనంత భద్రతలో ఏమీ లేరు. చెడు కాలాలు వస్తే ఆశ్చర్యపడనవసరం లేదు.

## మొదట్లో నీవు అవివేకంగా ప్రవర్తించితే ఆశ్చర్యపడనక్కరలేదు (21:1-22:1)

ఈ ప్రశ్నను ఒక క్షణంసేపు ఆలోచించు: దావీదు ఎందుకు పారిపోయాడు? సింహాన్ని, ఎలుగుబంటిని అతడు ఎదిరించి నిలిచాడు. అతడు గొల్యాతును ఎదుర్కొన్నాడు. ఫిలిష్తీయులకు వ్యతిరేకంగా అతడు అనేక యుద్ధాలను జయించాడు; వాస్తవానికి అతడు సైనిక వీరుడు. తన ప్రాణ రక్షణకొరకు పారిపోయేదానికి బదులు సౌలుకు అతడు ఎందుకు ఎదురు నిలువలేదు? నేను ఈ సంగతిని నీకు చెప్పనీయి: తన జీవితంలో తొలిసారిగా పరిస్థితిని ఎలా సంభాళించాలో అతనికి తెలియలేదు. ఇంతవరకు, వ్యతిరేకతను సంభాళించడమంటే, వ్యతిరేకించినదేదైనా చంపివేయడమే. అతడు సింహాన్ని, ఎలుగుబంటిని చంపాడు. అతడు గొల్యాతును చంపాడు. అతడు ఫిలిష్తీయులను చంపాడు. అయితే, సౌలు మాత్రం దేవునిచే అభిషేకింపబడిన రాజు. యెహోవాచే అభిషేకింపబడిన వానిని దావీదు చంపనేరడు.[15] ఏమి చేయాలో తోచలేదు గనుక దావీదు పారిపోయాడు.

దావీదు తన జీవితాన్ని పారిపోయినవాడుగా ఆరంభించాడనేది ముఖ్యం. అతడు నిరాశగా పరుగెత్తేవాడు, అందులో ఏ ఉద్దేశం కాని ప్రయోజనం కాని ఉండేది కాదు, ఏవో కొన్ని అవివేకమైన పనులు చేస్తూ తిరిగేవాడు.

అతడు మొదట నోబుకు దక్షిణంగా రెండు మైళ్లు వెళ్లాడు. షిలోహు నాశనం అయిన పిమ్మట[16] ప్రత్యక్షగుడారం మార్చబడి, యాజకులకు, వారి కుటుంబాలకు అది ఒక పట్టణంగా మారిపోయింది. దావీదుకు ఆహారంగాని, ఆయుధాలుగాని లేవు, "ఏదైనా యిచ్చే విషయంలో యాజకులు మంచిగా ఉంటారని అతడు ఆలోచించి ఉండవచ్చు." ఏలాగైనా, అతడు అక్కడికి వెళ్లినప్పుడు, సౌలుతో గట్టి సంబంధాలు కలిగియుండినవాడైన అహీమెలెకు[17] అనే ప్రధాన యాజకుని చెంతకు చేరాడు. గతంలో దావీదు ప్రత్యక్షగుడారం వద్దకు తరచుగా వస్తూ ఉండేవాడు, అయితే అతడు ఎప్పుడు వచ్చినా అతనితో రాజాధికారుల గుంపు లేక ఒక సైనికుల ముఠా ఉండేది. ఇప్పుడు, అతడు ఒంటరిగా వచ్చాడు. తన్ను రక్షించుకొనడానికిని, సహాయం పొందడానికిని దావీదు డంబంగా ఒక అబద్ధమాడాడు, సౌలు అతి రహస్యమైన పనికొరకు తనను పంపినట్టు దావీదు చెప్పాడు. ప్రధానయాజకుడతనికి సముఖపు రొట్టెలు అయిదు,[18] (అప్పటికి లభ్యమైన రొట్టెలు అవి మాత్రమే) యిచ్చాడు. తరువాత, యెహోవా ప్రత్యక్షగుడారములో ప్రదర్శనకై పెట్టబడిన గొల్యాతు యొక్క ఖడ్గాన్ని యిచ్చాడు. దావీదు తాను కోరినవాటిని పొందడానికి అబద్ధాన్ని, పన్నాగాన్ని పన్నాడు.[19] దావీదు దేవుని హృదయాను సారుడన్నట్టు కాక, సౌలువలె నటించాడు!

దావీదు అహీమెలెకుతో మాట్లాడుతూ ఉండగా, దోయేగు అనేవాడు అక్కడ నిలబడి ఉండడాన్ని ఇబ్బందిగా చూసాడు.[20] దోయేగు అనేవాడు సౌలుకు ప్రధాన పశువుల కాపరి. (ప్రస్తుతానికి ఈ వాస్తవాన్ని భద్రంగా ఉంచుకో.)

వీలైనంత త్వరగా దావీదు మరల వెళ్లిపోయాడు. ఈసారి అతడు నైరుతికి ప్రయాణం సాగించి, గాతు పట్టణంవైపుకు వెళ్లాడు. ఫిలిష్తీయులకంటెను సౌలుకే ఎక్కువగా భయపడవలసియుందని దావీదు గుర్తించాడు. (దురదృష్టవశాత్తు, మన "శత్రువుల కంటెను" మన "సహోదరులనుండియే" మనకు ఎక్కువ భయము కలగడమనేది తరచుగా నిజమై ఉంటుంది!) శరణార్థిగా అతడు గాతుకు పరుగెత్తాడు, అలా చేయడం నిజంగా వెర్రితనమే! గొల్యాతు ఎక్కడివాడో నీకు తెలుసా? గాతువాడే![21] గొల్యాతును చంపి, రెండువందల మంది ఫిలిష్తీయులను చంపి, మీకాలు కన్యాశుల్కముగా వారి అవయవ ములను కోసి, యుద్ధములో ఎక్కువమంది ఫిలిష్తీయులను సంహరించి "దావీదు పదివేల మందిని చంపినట్టు" పాడించుకున్నది ఈ స్థలమునుండే – ఫిలిష్తీయా కేంద్ర స్థలానికి వచ్చాడు, గొల్యాతు స్వగ్రామంలోనికి అతడు (గొల్యాతు ఖడ్గాన్ని మొలకు కట్టుకొని) ధైర్యంగా నడిచిపోయాడు, రాజు వద్దకు తీసికొనిపొమ్మని అడిగాడు![22]

గుర్తు తెలియనివాడుగా ఉండగలనని దావీదు తలంచియుండవచ్చు, కాని అతని ఎరుపు జుట్టును ఎవ్వరూ మరచిపోరు! ఆకీషుయొక్క సేవకులకు ఇశ్రాయేలులో పాడినపాట "సౌలు వెయ్యి మందిని దావీదు పదివేల మందిని చంపిరి" అనేది తెలుసు.[23]–పదివేల మంది ఫిలిష్తీయులంటే, ఫిలిష్తీయులను "పట్టుకోవాలనే వాళ్ళ పట్టికలో" దావీదు

మొట్టమొదట ఉన్నాడనే కదా!

వారు దావీదును పట్టుకొన్నారు,[24] అతడు బెదరిపోయాడు "కాబట్టి వారియెదుట తన ప్రవర్తనను మార్చుకొని వెర్రివానివలె నటించుచు, ద్వారపు తలుపులమీద గీతలు గీయుచు, ఉమ్మి తన గడ్డముమీదికి కారనిచ్చుచుండెను. వారతని పట్టుకొని పోగా అతడు పిచ్చి చేష్టలు చేయుచు వచ్చెను" (21:13). దేవునిచే ఎన్నుకోబడినవాడు, ఇశ్రాయేలీయులకు రాబోయే రాజు, పిచ్చివానివలె నటిస్తున్నాడు!

ఆకీషు విసికిపోయాడు. "... నా సన్నిధిని పిచ్చి చేష్టలు చేయుటకు వీని తీసికొని వచ్చితిరేమి? వీడు నా నగరులోనికి రాతగునా?" అని అన్నాడు (21:15). వారు దావీదును వదలిపెట్టారు. (పిచ్చివారు దేవతలచే తాక బడినవారు గనుక వారికి హాని చేయకూడదని చాలమంది పూర్వికులు నమ్మేవారట[25].)

ఈ సంఘటనను చదివేటప్పుడు నాకు మిశ్రమైన ఉద్వేగాలు కలిగాయి. దావీదుకు గల చురుకైన ఆలోచనలను నేను అభినందించాను - అతనిని తప్పించిన ఘనతను దావీదు దేవునికే ఆరోపించాడు.[26] కాని, దావీదు ఆలోచనా సరళి సక్రమంగా ఉన్నట్టయితే, అతడు పిచ్చివాడుగా నటించవలసిన అవసరం అతనికి ఎన్నడును కలుగకుండేదే. దేవుని అభిషిక్తుడు తన కండ్లను తిప్పడం, పిచ్చిమాటలు పలకడం, ... వ్రేలి గోరును ద్వారబంధాల యొక్క కొయ్యమీద రుద్దడం ... తన చేతులను క్రిందికి వెర్రిగా దించుకొనడం ...[27] ... తన గడ్డంమీద ఉమ్మి కార్చుకొనడం నాకు దుఃఖం కలిగిస్తుంది.[28]

దావీదు ఎంత హీనుడుగా దిగ జారగలడు? అన్నిటిని మించి దావీదు చేయగలిగింది ఒక కన్నంలో గుండా దూరి దాంట్లోంచి పాకిపోవడమే - అదే అతడు చేశాడు. గాతునుండి, మన పాఠం ప్రారంభమైన గుహకు అతడు పరుగెత్తుకొంటూ వెళ్లాడు-అది అదుల్లాము గుహ.[29]

అదుల్లాము అనేది గాతుకు బేత్లెహేమునకు మధ్యనున్న యూదావారి పట్టణం.[30] అది నిర్మానుష్యమైనది, రాళ్లమయమైనది, నిస్సారమైనది. గుహలకు పేరుగాంచిన ఒక కొండ అక్కడ ఉంది, ఆ పట్టణం ఒక ద్వారం కాదు, వేలకొలది మార్గాలు కలిగి, మైళ్ల దూరం వెళ్లే వందలాది సొరంగాలు కలది. నీళ్ల పాములు యితర విష సర్పాలతో అవి నిండుకొని యుంటుంది. దొంగలకును ఉగ్రవాదులకును ఆ గుహలు నిలయమై ఉన్నందున నేడు గైడ్స్ ప్రవాసులను అక్కడికి తీసికొనిపోరు. "లోకానికి అది రక్షకము"[31] అని Lynn Anderson దాన్ని పిలిచాడు. "నా యెడల జాలిపడువాడు ఒకడును లేడు" అని పలికినప్పుడు (కీర్తన. 142:4), దావీదు యిక్కడ దాగియున్నాడు. దావీదు జీవితంలో అది దీనాతి దీనమైన స్థితి.

మళ్లీ నాదొక పాయింట్, చెడు కాలం దావీదుకు వచ్చినట్టు మీకు నాకూ కూడా కలుగవచ్చు. కొన్ని సంవత్సరాల క్రితం, నా స్నేహితుడొకడు, యువకుడు, బ్యాంకు ఉద్యోగి. అతనికి ఆబాల్యంగా చక్కెర వ్యాధి ఉన్నట్టు తెలిసింది. అతడు ఉల్లాసంగా చురుకుగా, క్రీడలలో ఆరితేరిన యువకుడు. ఈ వ్యాధి ఉన్నట్టు డాక్టర్లు చెప్పినప్పుడు ఒక పరిగెడుతున్న రైలు వచ్చి గుద్దినట్టయింది. చాలా వారాలవరకు అతడు ఆలోచనలేమీ లేక శూన్య మనస్కుడయ్యాడు. నిరాశాభరితుడయ్యాడు. అతని ఆలోచనా రాహిత్యానికో

ఉదాహరణ చెప్తాను. అతడు సాకర్ ఆటను టి.విలో చూస్తూ ఏడ్పు మొదలెట్టాడు "నేనిక మరెప్పుడూ సాకర్ ఆటను ఆడలేను" అంటూ, అతడు మునుపెప్పుడూ సాకర్ ఆట ఆడినవాడు కాదు. ఇక ముందుకు కూడా ఆడే ఉద్దేశ్యమేమీ లేదు. కాని ఆ విషయం అతనికి తోచలేదు. కాని తాను ఆడే రోజులైపోయినట్టుగా అతడు భావించుకున్నాడు. ప్రభువు సహాయంతోను, కుటుంబము, స్నేహితులు యిచ్చిన ప్రోత్సాహం వల్లను అతడు బాగుపడి పూర్వంలా అయ్యాడు. తనకు తాత్కాలికంగా కలిగిన నిరాశను తలచుకుని అతడిప్పుడు నవ్వుకుంటాడు. కాని కొంత కాలం తాను ఫూలిష్‌గా ప్రవర్తించినట్టు అతడు ఒప్పుకొంటున్నాడు.

మనకు విపత్తు కలిగినప్పుడు, అర్థరహితంగా ఆలోచించ కూడదని మనం అనుకోవచ్చు, కాని మనకు అసలు తెలియదు. నేను ఎలా రియాక్ట్ కాగోరతానో నాకు తెలుసు, నేను ఎలా రియాక్ట్ అవ్వడానికి నిరీక్షిస్తానో నాకు తెలుసు, అయితే అది అలా జరుగకపోవచ్చు. మనకు చెడ్డ కాలాలు వచ్చినప్పుడు, మొదట్లో మనం మూర్ఖంగా ప్రవర్తించినా, ఆశను వదులుకోవద్దని నేను చెప్పుతున్నాను. ఇది ఎవరికైనా సంభవించవచ్చునని గ్రహించు - దేవుని సహాయంతో మన బతుకు సాగించగలమని గ్రహించు. దావీదు అలా చేశాడు; నా స్నేహితుడు చేశాడు; నీవు నేను కూడా చేయవచ్చు.

## నీ సొంత కార్యాలకు బాధ్యతను అంగీకరించు (22:1-23)

అదుల్లాము గుహకు చేరినప్పుడు కీర్తన. 142 వ్రాసియుండవచ్చు, ఎందుకంటే, దావీదు అక్కడ ఎక్కువ కాలము ఉండనట్టు 1 సమూ. 22 గుర్తిస్తుంది.

> దావీదు అక్కడనుండి బయలుదేరి అదుల్లాము గుహలోనికి తప్పించుకొనిపోగా అతని సహోదరులును అతని తండ్రి ఇంటివారందరును ఆ సంగతి విని అతనియొద్దకు వచ్చిరి. మరియు ఇబ్బందిగలవారందరును, అప్పులు చేసికొనిన వారందరును, అసమాధానముగా నుండు వారందరును, అతనియొద్ద కూడుకొనగా అతడు వారికి అధిపతియాయెను. అతనియొద్దకు ఎక్కువ తక్కువ నాలుగువందలమంది వచ్చియుండిరి (22:1, 2).

మొదట, దేవుడు దావీదుకు ఉద్వేగ సంబంధమైన సపోర్టునిచ్చాడు. దావీదుకు ఒక కుటుంబాన్నిచ్చాడు. "అతని సహోదరులును, అతని తండ్రి ఇంటి వారందరును ... అతనియొద్దకు వచ్చారు." దావీదు కుటుంబానికి కూడా సౌలువలన అపాయం కలుగుతుందంటే అనుమానించవలసిన పనిలేదు.[32]

తరువాత దేవుడు దావీదుకు ప్రాక్టికల్ సపోర్టునిచ్చాడు. దావీదు చేయడానికి ఒక పని కల్పించాడు. ఒంటరిగా కూర్చుండి తనకొరకు తాను విచారించకుండ, తన చుట్టుచేరినవారిని ఒక సైన్యంగా తీర్చి దిద్దే అవకాశం అతనికివ్వబడింది. దావీదు చుట్టు "మూడు రకాలైన" గుంపులు పోగయ్యాయ్ "ఇబ్బందిగలవారు," "అప్పులు చేసికొన్నవారు,"

"అసమాధానంగా ఉండువారు." "ఇబ్బందిగలవారు" అనేది హెబ్రీలో "అణచబడినవారు" అన్నట్టు సూచిస్తుంది. "అప్పులు చేసికొన్నవారు" సౌలు విధించిన అధికమైన పన్నుల భారంలో మునిగినవారు తాము తమ కుటుంబాలు అప్పు చెల్లించక బానిసలుగా అమ్మబడే స్థితినుండి పారిపోయినవారు. "అసమాధానంగా ఉన్నవారు," అపచారము చేయబడి, అవమాన పరచబడినవారై, మార్పుకొరకు ఆతురతకలిగినవారుగా చెప్తుంది. దావీదు ఒక్కడు మాత్రమే బాధింపబడడం లేదు, సౌలు ఏలుబడిలో దేశంయావత్తు మూలుగుతోంది.

ఈ మనుష్యులు యుద్ధంకోసం సిద్ధపరచబడినవారు కారు. వీరందరు అసంతృప్తులు, వారిలో అనేకులు ఎవరితోనూ పొందికగా ఉండలేరు. ("దావీదువెంట వెళ్లినవారిలో దుష్టులును, పనికిమాలినవారును" వెళ్లినట్టు కథలోని తరువాత భాగంలో చదువుతాం.[33] ఒక సమయంలోనైతే, ఈ మనుష్యులు దావీదును రాళ్లతో కొట్టి చంపగోరిన వారు![34]) ఈ పనికిమాలినవారిని ఒక సైన్యాన్ని పోలినట్టు తీర్చిదిద్దడానికి ఎలా పూనుకోగలడు? నాకు తెలియదు, అయితే దావీదు దేవుని సవాలును అంగీకరించాడు. త్వరలోనే దావీదు బిజీ అయిపోయాడు, దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి గాను చురుకుగా పని ప్రారంభించాడు. రాజ్యంకొరకు పవర్ బేస్‌ను అతడు నిర్మిస్తున్నాడు, తన పరిపాలనా కాలమంతా తనతో ఉండేవారికి నాయకత్వాన్ని అతడు పెంపొందిస్తున్నాడు. 2 సమూ. 23 దావీదుయొక్క "పరాక్రమశాలురను" గూర్చి మనం చెప్పబడేటప్పుడు యిలా చదువుతాం, "మరియు ముప్పదిమంది అధిపతులలో శ్రేష్ఠులైన ముగ్గురు కోతకాలమున అదుల్లాము గుహలోనున్న దావీదునొద్దకు వచ్చినప్పుడు ఫిలిష్తీయులు రెఫాయీము లోయలో దండు దిగియుండిరి" (23:13). దావీదు రాజైనప్పుడు, తన "కేబినెట్" తర్ఫీదు చేయబడి, నమ్మకాన్ని నేర్చుకొని అరణ్యంలో ఎదురు బదురుగా నిల్చుని పోరాటం నేర్చుకున్నారు.

చెడుకాలం వచ్చినప్పుడు మనం ఫూలిష్‌గా ప్రవర్తిస్తాం, మన తలలు తిరిగి తిన్నగా పని చేయాలంటే, దేవుడు మనయెదుట ఉంచిన సవాళ్లమీద దృష్టి నిలిపి – ఇతరులకు సహాయపడుటలో బిజీగా ఉంటూ మనకొరకు మనమే దుఃఖపడడం మానుకోవాలి.

చివరిగా, దేవుడు దావీదుకు ఆత్మసంబంధమైన సపోర్టునిచ్చాడు. 1 సమూ. 22:5 యిలా గుర్తిస్తుంది: "మరియు ప్రవక్తయగు గాదు వచ్చి–కొండలలో ఉండక[35] యూదా దేశమునకు పారిపొమ్మని దావీదుతో చెప్పినందున దావీదు పోయి హారెతు అడవిలో చొచ్చెను." ఒక సమయములో గాదు దావీదు సైన్యంలో చేరి తన సలహాదారులలో ఒకడాయెను. దావీదు రాజైన తరువాత, గాదు "దీర్ఘదర్శిగా" ఉన్నాడు.[36] దావీదు పరిపాలన ప్రతిదిన చర్యలను వ్రాసేవారిలో, చివరికి, గాదు ఒకడాయెను.[37]

దావీదు పరిస్థితులు మెరుగు పడనారంభించినప్పుడు, తన బుద్ధిహీనత పర్యవసానాలను అతడు చూడనారంభించాడు. ఒక రోజున, సౌలు గిబియాకు వెలుపల ఒక చెట్టు క్రింద కూర్చుండియుండగా, అతని ప్రముఖ అధికారులు అతని చుట్టు ఉన్నారు, రాజు తన పరిస్థితినిబట్టి వాపోతూ, "... నా నిమిత్తము మీలో ఎవనికిని చింతలేదే" అని అన్నాడు (22:8). ఎదోమీయుడగు దోయేగు సమీపమున నిలుచున్నాడు (అతడు గుర్తున్నాడా? నోబులో ప్రత్యక్షగుడారము వద్ద దావీదును చూచినవాడు అతడే). "–యెష్షయి కుమారుడు పారిపోయి నోబులోని అహీటూబు కుమారుడైన అహీమెలెకు

దగ్గరకురాగా నేను చూచితిని. అహీమెలెకు అతని పక్షముగా యెహోవాయొద్ద విచారణ చేసి,[38] ఆహారమును ఫిలిష్తీయుడైన గొల్యాతు ఖడ్గమును అతనికిచ్చెను" అని దోయేగు అన్నాడు (22:9, 10). ఆరంభంలో అహీమెలెకు వెనుకాడిన సంగతిగాని, దావీదు అతని మోసగించిన విషయాన్ని గాని అతడు ప్రస్తావించలేదు. సౌలు మరోసారి వెర్రెక్కిపోయాడు. అహీమెలెకును, తక్కిన యాజకులను సంహరించడానికి పంపాడు. నోబు పట్టణాన్ని: పురుషులు, స్త్రీలు, పిల్లలు, శిశువులు, జంతువులను సహితం సంపూర్ణంగా నాశనం చేయించాడు![39]

వారిలో యాజకుడైన అహీమెలెకు కుమారుడైన అబ్యాతారు తప్పించుకున్నాడు.[40] అబ్యాతారు దావీదు వద్దకు వచ్చి జరిగిన దానిని అతనికి తెలియజేశాడు. తనకు కలిగిన విపత్తుకుగాను మరొకరి మీద నింద వేయడం దావీదుకు తేలికే. "అదంతా సౌలు తప్పే అతడు నన్ను చంప ప్రయత్నించ కుండినట్టయితే యిదంతా జరిగియుండేది కాదు!" లేదా "సౌలు అతిగా ప్రవర్తించకుండి నట్లయితే, నీ కుటుంబమంతా యింకను సజీవంగా ఉండియుండేదే!" మరల, అహీమెలెకు పై యిలా నింద మోపియుండేవాడే: "మీ తండ్రి నా మీద సవాలు విసరకుండ ఉండియున్నట్టయితే, నాకు అబద్ధమాడవలసి వచ్చేది కాదు" దావీదు యింకా యిలా చెప్పియుండవచ్చు, "అది కేవలం దురదృష్టం. అంటే, దోయేగు అక్కడ ఉండకుండినట్లయితే, ఇంత జరిగేది కాదు, కదా?" అయితే దావీదు నేరం యింకెవరి మీదా పెట్టలేదు సరికదా, దానికి సాకులు చెప్పడానికి సహా పూనుకోలేదు. హృదయ పరితాపంతో అతడిలా అన్నాడు: "–ఆ దినమున ఎదోమీయుడైన దోయేగు అక్కడ ఉన్నందున వాడు సౌలునకు నిశ్చయముగా సంగతి తెలుపునని నేననుకొంటిని; నీ తండ్రి ఇంటివారికందరికి మరణము రప్పించుటకు నేను కారకుడనైతినిగదా" (22వ.). NIV యిలా అంటుంది: "నీ తండ్రి కుటుంబములో అందరు మరణించుటకు నేనే బాధ్యుడను." "సౌలు దీనికి బాధ్యుడు" లేక "అహీమెలెకు దీనికి బాధ్యుడు," లేక "దోయేగు దీనికి బాధ్యుడు" అని దావీదు అనలేదు, కాని "నేనే బాధ్యుడనని" అతడన్నాడు.

చెడు కాలం వచ్చినప్పుడు మనలో ఎవరైనా బుద్ధిహీనంగా ప్రవర్తింపవచ్చు – అయితే మన బుద్ధి హీనతకు మనము బాధ్యులము కామని దాని అర్థం కాదు. ఏదో ఒక విషయం వద్ద, మన బ్రతుకుల్లో ప్రభువును పని చేయనిచ్చి, మన ఆలోచన సరిగ్గా సాగాలని నా ప్రార్థన. మనం ఆ పాయింటుకు చేరుకున్నప్పుడు, మన సొంత కార్యాలను బాధ్యతను అంగీకరించగలిగినంత ఎదిగి, సత్యంగా ఉందాం. మనం ఎలా ప్రవర్తించామో దానికిగానూ యితరులను నిందించవద్దు; పరిస్థితులను నిదించవద్దు; వ్యక్తిగతమైన బాధ్యతను అంగీకరిద్దాం.

దావీదు అబ్యాతారును ఎదుర్కొన్నట్టు, మనం బాధించినవారిని ఎదుర్కొనే అవసరం ఉండవచ్చు.[41] "అయామ్ సారీ, అయితే నా మతిపోయింది. నేను కొంతసేపు బుద్ధిహీనంగా వ్యవహరించాను. నేను చేసిన దానికి ఏ కారణం లేదు. నన్ను క్షమించడానికి దాన్ని నీ హృదయంలో కనుగొంటావని నేను నిరీక్షిస్తున్నాను" అని నీవు చెప్పవలసి ఉండవచ్చు.[42] మన యథార్థతను గట్టిగా నిలుపుకొని, మన సొంత కార్యాలకు మన బాధ్యతను అంగీకరించలేకపోతే చెడు రోజుల్లో బతుకు సాగించలేం.

# ప్రజలు నిన్ను చేయి విడిచినట్లయితే, ఆశ్చర్యపడవద్దు (23:1-29)

కడకు దావీదు గుహలోనుండి వెలుపలికి వచ్చాడు, అతని చుట్టు అతని సహాయకుల గుంపు తయారయ్యింది, అయితే చెడు కాలం తొలిగిపోయిందని దాని అర్థం కాదు. చెడు కాలాలు వచ్చినప్పుడు, తరచుగా మనుషులు, నీవు ఎన్నడు కీడు చేయని వాళ్ళు, నీ చేత సహాయం పొందినవారే కావచ్చు - అలాటివాళ్ళు సైతం నీ చేయి విడుస్తారనే కఠినమైన పాఠం దావీదు నేర్చుకోవలసివచ్చింది.

తరువాత అధ్యాయం యిలా ప్రారంభమౌతుంది: "తరువాత ఫిలిష్తీయులు కెయిలా మీద యుద్ధము చేసి కల్లములమీది ధాన్యమును దోచుకొనుచున్నారని దావీదునకు వినబడెను" (23:1).[43] కెయీలా అనేది శత్రువుల సరిహద్దుల వెనుకనున్న ఇశ్రాయేలు పట్టణం.[44] శత్రువులు మీద పడడానికి వీలైన పట్టణం. ఫిలిష్తీయులతో యుద్ధం చేయడం సౌలు పని,[45] శత్రువులతో యుద్ధం చేసే బదులు దావీదును వెదకడంలో అతడు తన సహాయాన్ని వ్యయం చేస్తున్నాడు.

"అంతట దావీదు-నేను వెళ్లి యీ ఫిలిష్తీయులను హతము చేయుదునా అని యెహోవాయొద్ద విచారణ" చేశాడు (23:2). దావీదు మనుష్యులు యిప్పుడు ఆరువందల మంది అయ్యారు,[46] రికార్డులో దాఖలు చేయబడినంతవరకు, వారు యుద్ధ భూమిలో ప్రవేశించినవారు కారు. కెయీలా శత్రువుల లైన్సు వెనుకనున్నందున, చుట్టు ప్రక్కల అన్ని మార్గాలను మూసివేసినట్టయితే వారు తేలికగా లోబడిపోతారు. "గనుక దావీదు యుద్ధానికి వెళ్లే విషయంలో యెహోవా వద్ద" విచారణ చేశాడు.

"యెహోవా వద్ద విచారణ చేయడం" అనే ప్రయోగ ప్రాముఖ్యతను తెలిసుకొనడానికి యిక్కడ కొంచెంసేపు ఆగుదాం. యాజకులనందరిని సౌలు హతం చేసినప్పుడు, అబ్యాతారు తన రక్షణ కొరకు దావీదు వద్దకు పారిపోయిన సంగతిని జ్ఞాపకముంచుకో. అబ్యాతారు ప్రధాన యాజకుని కుమారుడైనందునను, మిగిలిన యాజకులందరును చంపబడి నందునను, అబ్యాతారే యిప్పుడు ప్రధాన యాజకుడై యున్నాడు. ప్రధాన యాజకుని కాపాడినవాడుగా దావీదు నిలుస్తాడు, అతడు రాజుగా అవడానికిది ముఖ్యమైన మెట్టు.

పైగా, అబ్యాతారు దావీదునొద్దకు వచ్చినప్పుడు, అతడు ఏఫోదును తీసికొనివచ్చాడు (23:6, 8)[47] ఏఫోదు అనేది యాజకుని దుస్తులపై ధరించే చేతులులేని పైవస్త్రం. యాజకులందరు ఏఫోదును ధరిస్తారు,[48] కాని ప్రధాన యాజకుడు ధరించే ఏపోధు ఒకటుంటుంది. అందులో ఊరీము, తుమ్మీము అనేవి ప్రధాన యాజకుని ఎద భాగం వద్ద ఉంచబడతాయి.[49] ఊరీము తుమ్మీములనేవి దేవుని చిత్తాన్ని వివేచించడానికి ఉపయోగపడతాయి. అసలు ఈ ఊరీము, తుమ్మీములు ఏమైయున్నాయో, అవి ఎలా ఉంటాయోకూడా మనకు నిక్కచ్చిగా తెలీదు. నిర్గమ. 28లో వర్ణింపబడిన రాళ్లలో అవి ఒకవేళ భాగమైయుంటాయేమో. ఏఫోదు యొక్క పాకెట్‌లో ఉన్న రంగురాళ్లేమో, నాణ్యాన్ని తాకినట్టు[50] అవి ఉపయోగింపబడవచ్చు. (దాని ప్రతిఫలము యెహోవాచేత తీర్మానించ

బడుతుందే గాని చాన్స్‌వలన కాదు) "అవును" లేక "కాదు" అని తేల్చుకోడానికి అవి ఉపయోగింపబడేలా ఉన్నాయి.

దావీదునకు దేవుడు ఆత్మసంబంధంగా ప్రత్యేకమైన ఆలంబానాన్నిచ్చాడు: ఇప్పుడు దావీదుతో ప్రధాన యాజకుడున్నాడు, ఊరీము తుమ్మీములతో కూడిన ఏఫోదు ఉంది! ఈ విధంగా దావీదు "యెహోవా వద్ద విచారణ" చేయగలుగుతున్నాడు.

"ఫిలిష్తీయులతో యుద్ధము చేయ పోవుదునా?" అనే దావీదు ప్రశ్నకు, దేవుని జవాబు "అవును"[51] గనుక, "దావీదును అతని జనులును కెయీలాకు వచ్చి ఫిలిష్తీయులతో యుద్ధము చేసి వారిని లెస్సగా హతము చేసి... దావీదు కెయీలా కాపురస్థులను రక్షించెను" (23:5). పట్టణాన్ని రక్షించిన దావీదును అతని జనులును కెయీలాలో ఉన్నారు, ఒకవేళ దానిని వారి హెడ్‌క్వార్టర్స్ చేసికోవాలనే ప్లానుతోనో ఏమో. ఆ పట్టణస్థులు తమను అభినందించడానికిని, అండగా నిలవడానికిని ఎదురు చూచే హక్కు దావీదుకు అతని మనుష్యులకు ఉంది. అయితే వారు అక్కడ ఉన్నారన్న సమాచారం సౌలుకు అందింది. వారిమీదికి రావాలనే ప్లానులో అతడున్నాడు. మరల దావీదు యెహోవా వద్ద విచారణ చేశాడు, "కెయీలా మనుష్యులు నన్నును నా జనమును సౌలుకు అప్పగిస్తారా?" అనేది అతని ప్రశ్నలలో ఒకటి. "వారు నిన్ను అప్పగిస్తారు" (23:12) అని యెహోవా ప్రత్యుత్తర మిచ్చాడు.

ఇది బాధ కలిగించాలి! దావీదుచేత విడిపింపబడిన పట్టణం యిక్కడ ఉంది – వారి పట్టణం క్షేమంగా ఉంది; వారి పంట, పాడి, వారి కుటుంబాలు క్షేమంగా ఉన్నాయి – అయినా వారి విమోచకుని వారు మోసం చేయదలుచుకున్నారు. నోబు పట్టణాన్ని సౌలు నాశనం చేసిన సంగతిని వారు వినియుండవచ్చు. వారు దావీదు పక్షంగా ఉన్నట్టయితే, తమను కూడా లయపరచడానికి అతడు వెనుకాడడని వారు తలంచియుండవచ్చు, కాని దావీదు మింగడానికి అది చేదైన మాత్రయైయుంది. ఏదియెలాగున్నా, దావీదు మాత్రం ప్రతీకారం తీర్చుకోదలచలేదు. "అంతట దావీదును దాదాపు ఆరువందల మందియైన అతని జనులును లేచి కెయీలాలోనుండి తరలి, ఎక్కడికి పోగలరో అక్కడికి వెళ్లిరి" (23:13).

తరువాత దావీదును అతని జనులును యూదాలోని జీఫు అరణ్యానికి చేరుకున్నారు. జీఫీయులు యూదా గోత్రికులు, దావీదు కూడా అదే గోత్రంనుండి వచ్చాడు.[52] వీరు అతని స్వజనులే! ఇక్కడ అతడు క్షేమంగానే ఉన్నాడు. ఏదియెలాగున్నా, తాను ఎన్నడు హాని చేయని జనులు, ఒకవేళ తన భద్రతననుభవించినవారే,[53] తిరిగి దావీదును మోసగించారు. జీఫీయులు సౌలు వద్దకు వెళ్లి దావీదు ఎక్కడ ఉన్నది తెలిపి, అతనిని అప్పగింతుమని తెలిపారు.[54] కేవలం దేవుని జోక్యంచేతనే దావీదు తప్పించుకున్నాడు. కొన్ని అధ్యాయాలు గడిచిపోయాయి,[55] జీఫీయులు మరల దావీదును మోసగించారు.

మోసగింపబడింది దావీదుకు యిది మొదటిసారి కాదు సరిగదా, యిదే కడసారి కూడా కాదు; అది ఎన్ని సార్లు సంభవించినా సరే, అది బాధ కలిగిస్తునే ఉంటుంది. నేను ఏమి మాట్లాడుతున్నానో నీకు కచ్చితంగా తెలుస్తు ఉండవచ్చు. ఒకని మీద నీవు నమ్మకముంచావనుకో. నీ జీవితమంతా నీవు అతనిని నమ్మియుండవచ్చు. అప్పుడు

అతడు నిన్ను మోసగించాడనుకో అతడు నిన్ను చేయి విడిచాడు, అప్పుడు నీకు వేదన నిండిపోతుంది.

ఈలాటి పరిస్థితులు, మనం నరులను నమ్ముకోకూడదని, మనం కేవలం యెహోవా మీదనే ఆనుకోవాలని మన మనస్సుల్లో ముద్రలు వేస్తాయి. యుద్ధ సారలతోనిండిన సిలువ యోధుడైన పౌలు ఒకసారి యిలా అన్నాడు, "నేను మొదట సమాధానము చెప్పినప్పుడు ఎవడును నా పక్షముగా నిలువలేదు, అందరు నన్ను విడిచిపోయిరి; ... ప్రభువు నా ప్రక్క నిలిచి నన్ను బలపరచెను ..." (2 తిమోతి 4:16, 17).

## నిన్ను చేయి విడువని స్నేహితులకు కృతజ్ఞత కలిగియుండు (23:15-18)

అధ్యాయం 23:15నుండి 18వరకు ఉన్నది, మిగిలిన అధ్యాయాల కంటె ఇది భిన్నంగా ఉంటుంది. దావీదు ప్రాణాన్ని తీయాలని సౌలు పిచ్చిగా వెంటాడుతూ ఉండగా, కెయీలావారును జీఫీయులును దావీదును మోసగించుటకు సిద్ధంగా ఉండగా, యోనాతాను వచ్చి దావీదును, "దేవునియందు బలపరచిన" క్లుప్త సంఘటన మనకున్నది. మనము ఏమైయున్నా, యిద్దరి మధ్య ఎంత దూరం ఉన్నా, స్నేహితులు నీతో కూడా ఉంటారు. నీకు అలాటి ఒక స్నేహితుడున్నట్టయితే అందుకు నీవు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి.

## దేవుడు నిన్ను ఎన్నడు చేయివిడువడని తప్పక నమ్ము (23:14, 25, 26)

ఒక దేశంలో ఉన్న సమస్త మూలాలు ఒకని లయపరచడానికి కేంద్రీకృతమైనప్పుడు, అతని చుట్టు ఉన్నవారు అతనిని అప్పగించడానికి ఆతురతపడుతూ ఉండగా, ఒక్కడు తప్పించుకునేది ఎలా? 23:14లో, దావీదు తప్పించుకొనినట్టు మనం చదువుతాం: "అయితే దావీదు అరణ్యములోని కొండస్థలములయందును, జీఫు అరణ్యమున ఒక పర్వతమందును నివాసము చేయుచుండెను; సౌలు అనుదినము అతని వెదకినను దేవుడు సౌలుచేతికి అతని నప్పగించ లేదు." సౌలు వేసిన ఉచ్చులన్నిటిని తప్పించుకొనడానికి దావీదు అందరికంటే చాలా సామర్థ్యం కలిగి పారిపోగలిగినవాడైనందున కాదు, తన్ను కాపాడడానికి అతని చుట్టు ఆరువందల మంది తర్ఫీదు పొందిన సైనికులున్నందున కూడా కాదు. దావీదు తప్పించుకొని పోగలిగింది ఎందుకంటే – "దేవుడు అతనిని సౌలు చేతికి అప్పగించలేదు" అంతే!

దావీదు జీవితంలో ఈ సమయాన్ని గూర్చి తెలియజేసే అధ్యాయాలను చూస్తే, యెహోవా అతనితో కూడ ఉండెను అని తెలిపే సమాచారం ఎన్నిసార్లు నిక్షిప్తమై ఉందో చూడు.[56] దావీదుకు ఏ దిక్కులేనప్పుడు, అతడు యెహోవావైపు తిరుగగలిగాడు. దావీదు కీర్తనలలో ఎక్కువ భాగం ఈలాటి అలజడి కలిగిన సమయానికి సంబంధించినవై

ఉన్నాయి. ఆ కీర్తనల ముందు ఉండే పరిచయపు నోట్సును గమనించు:

కీర్తన. 59: "సౌలు మనుష్యులను పంపినప్పుడు, అతని చంపడానికిగాను యిల్లును సోదా చేసినప్పుడు."

కీర్తన. 56: "గాతులో ఫిలిష్తీయులు అతని పట్టుకొనినప్పుడు."

కీర్తన. 34: "అబీమెలెకు ముందు పిచ్చివాడుగా నటించగా, అక్కడనుండి తరుమ బడినప్పుడు."

కీర్తన. 57: "గుహలో, సౌలుయొద్దనుండి అతడు పారిపోయినప్పుడు."

కీర్తన. 142: "అతడు గుహలోనున్నప్పుడు."

కీర్తన. 52: "ఎదోమీయుడైన దోయేగు సౌలునొద్దకు వచ్చి, దావీదు అహీమెలుకు నొద్దకు వచ్చిన విషయాన్ని గూర్చి చెప్పినప్పుడు."

కీర్తన. 63: "యూదా అరణ్యములో అతడు ఉన్నప్పుడు."

కీర్తన. 54: "జీఫీయులు సౌలునొద్దకువచ్చి, దావీదు మీ మధ్య దాగియుండలేదా? అని తెలిపినప్పుడు."

కలత కలిగిన కాలములలో, కొందరు తమ సంగతులు పరిశీలించుకునేందుకు దిన చర్యను రాసుకుంటారు, దావీదు కీర్తనలను వ్రాశాడు![57] అలాంటి సమయాల్లో మనలాంటివారు నిరాశతో కుమిలిపోతారు. దావీదైతే తన భయాలను మాత్రమే గాక, అతని విశ్వాసంకూడా మరువలేని పద్యాలలో భద్రపరచాడు. ఈ కాలానికి సంబంధించి నదిగా చెప్పబడ్డ మొదటి కీర్తనలో, దావీదు వ్యక్తపరచాడు:

> నా ప్రాణము తీయవలెనని వారు పొంచియున్నారు;
> యెహోవా, నా దోషమునుబట్టి కాదు నా పాపమును బట్టి కాదు
> ఊరకయే బలవంతులు నాపైని పోగుబడి యున్నారు.
> నాయందు ఏ అక్రమమును లేకున్నను వారు పరుగులెత్తి
> సిద్ధపడుచున్నారు (కీర్తన. 59:3, 4ఎ).

అటుపిమ్మట, ఏదియెలాగున్నా, దేవునియందు తన విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు: "దేవుడు నాకు ఎత్తయిన కోటగాను కృపగల దేవుడుగాను ఉన్నాడు. నా బలమా, నిన్నే కీర్తించెదను" (59:17)!

చివరి కీర్తనలో, జీఫీయులు తన్ను మోసగించినందుకు గాను దావీదు దేవునికి మొరపెట్టుతున్నాడు. దావీదు యిట్లన్నాడు:

> దేవా, నీ నామమునుబట్టి నన్ను రక్షింపుము
> నీ పరాక్రమమునుబట్టి నాకు న్యాయము తీర్చుము.
> దేవా, నా ప్రార్థన ఆలకింపుము
> నా నోటి మాటలు చెవినిబెట్టుము.
> అన్యులు నా మీదికి లేచియున్నారు
> బలాఢ్యులు నా ప్రాణము తీయజూచుచున్నారు ...
> (కీర్తన. 54:1-3).

దేవుడు ఆ ప్రార్థనకు జవాబిచ్చాడా? 1 సమూ. 23 ఆఖరున చూడు. జీఫీయులు దావీదును సౌలుకు అప్పగించడానికి పూనుకున్నప్పుడు, దావీదు ఖచ్చితంగా ఎక్కడ ఉన్నాడో తెలుపుడని రాజు వారినడిగాడు, దావీదు తిరిగి తప్పించుకొనకుండ ఉండడానికి గాను, జీఫీయులచే నడిపింపబడినవారై, సౌలును అతని సైన్యమును తప్పులేకుండ సరియైన చోటునకే వెళ్లారు. త్వరలోనే సౌలు దావీదు విచారణలో ఉన్నాడు: "... సౌలు పర్వతము ఈ తట్టునను దావీదును అతని జనులును పర్వతము ఆ తట్టునను పోవుచుండగా దావీదు సౌలు దగ్గరనుండి తప్పించుకొని పోవలెనని త్వరపడుచుండెను. సౌలును అతని జనులును, దావీదును అతని జనులను పట్టుకొనవలెనని వారిని చుట్టుకొనుచుండిరి" (23:26). వేలకొలదిగానున్న సౌలుయొక్క సైన్యము పర్వతాన్ని యిరువైపుల చుట్టి ఉన్నారు. దావీదును అతని జనులును మధ్య ఒత్తుకునిపోయారు. దావీదు తప్పించుకోగల మార్గమేదీ లేనట్టుంది. అప్పుడు దేవుడు జోక్యం పుచ్చుకున్నాడు. "ఇట్లుండగా దూత యొకడు సౌలు వద్దకు వచ్చి – నీవు త్వరగా రమ్ము, ఫిలిష్తీయులు దండెత్తి వచ్చి దేశములో చొరబడియున్నారని చెప్పగా, సౌలు దావీదును తరుముట మాని వెనుకకు తిరిగి ఫిలిష్తీయులను ఎదుర్కొనబోయెను" (23:27, 28ఎ).[58] 14వ వచనము యొక్క వెలుగులో ఈ మాటలు చదివి, "అలా కేవలం సంభవించింది" లేక "దావీదు అదృష్టవంతుడు కదా?" అని అనడం అసాధ్యం. దేవుడు సహాయం చేశాడని ప్రతివానికి అర్థమౌతుంది. తరువాత ఆ స్థలములో ఒక మెమోరియల్ ఏర్పాటు చేయబడింది. "కాబట్టి సెలహమ్మలెకోతు అని ఆ స్థలమునకు పేరు పెట్టబడెను" (23:28బి).

రాత్రి ఎంతటి చీకటియైనా, నీ విశ్వాసము దేవునియందుంచుము. అరణ్యంలో ఈ సత్యాన్ని పరీక్షించిన దావీదు, యిలా వ్రాశాడు: "దేవుడు మనకు ఆశ్రయమును దుర్గమునై యున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు" (కీర్తన. 46:1). "ఉన్నాడు" అనే పదాన్ని అండర్ లైన్ చేయి. ఆపత్కాలములో దేవుడు ఉన్నాడు; ఆయన నీ సమస్యలో నీతో కూడ ఉన్నాడు. ఇప్పుడే నీవు దానిని చూడలేకపోవచ్చు కాని నీవు ఆయనకు సన్నిహితంగా ఉండు. ఇప్పటినుండి అయిదు సంవత్సరాలు ... లేదా పది సంవత్సరాలు ... లేక ఇరవై సంవత్సరాలు వెళ్లిన తరువాత వెనుకకు చూడు దేవుని కరుణా హస్తము తేటగా కన్పిస్తుంది. దేవుని ఆశ్రయించు, ఆయన నిన్ను విడువడు!

## చేదుగా ఉండకు

చెడు సమయంలో బతుకును కొనసాగించిన దావీదునుండి చాలా యితర సూత్రాలను నేర్చుకోగలము. పగతీర్చుకునే విషయంలో దావీదు ఎట్టి వైఖరిని వినియోగించాడో 24నుండి 26 అధ్యాయాలవరకు వివరంగా తరువాత పాఠంలో చదువుదాం. చెడు సమయంలో మహా గొప్ప అపాయాలలో ఒకటేమంటే – మన హృదయాలలో చేదు నిండిపోతుంది. మన హృదయాలలో "చేదైన వేరు" ఏదీ కూడా మొలచి "కలవరపరచ కుండ" మనం జాగ్రత్తపడాలి (హెబ్రీ. 12:15).

## క్షమించువాడవైయుండు

చేదును తప్పించుకోవాలంటే, క్షమించడాన్ని నేర్చుకోవాలి. "హృదయము పగతీర్చు కొనుటకు కేక వేసినప్పుడు" అనే మన తరువాత పాఠముయొక్క సవాలు: "సమానమైన ద్వేషము ... మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి (ఎఫెసీ. 4:31, 32).

## ఏదీ శాశ్వతంగా ఉండదని గ్రహించు

అటు మంచి కాలాలేగాని యిటు చెడు కాలాలేగాని ఏవీ శాశ్వతమైనవి కావని గ్రహించడానికి యిది సహాయపడుతుంది. ట్రూత్ ఫర్ టుడేలోని తరువాత సంచికలో, పది సంవత్సరాల కాలం గడచిన తరువాత దావీదు రాజౌతాడు. చెడు కాలాలు ఎల్లప్పుడు ఉండవనే సంగతిని అక్కడ స్మరించు. వీటి మీద గాని యితర పాయింట్ల మీద గాని కాలం గడపవచ్చు – కాని ప్రస్తుతానికి చెడు కాలాల్లో బతుకు కొనసాగించడం ఎలా? అనే దానిని ముగించక ముందు చివరి ఒక సలహా:

## చెడు కాలాలనుండి మంచి వచ్చునని గ్రహించు

రోమా 8:28ని ఎన్నడూ మరువకు; దానిని గట్టిగా నమ్ము "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము." ఆ చీకటి దినాలలో దేవుడు దావీదు జీవితానికి ఏమి చేస్తున్నాడో ఆలోచించు. దావీదును చక్కదిద్దడంలో దేవుడు కొనసాగుతూ, అతన్ని రాజుగా సిద్ధపరచుతున్నాడు. గొర్రెలను కాయడమనేది అండర్ గ్రాడ్యుయేట్ కోర్స్. తన ప్రాణంకొరకు పారిపోవడం గ్రాడ్యుయేట్ కోర్సు.

దేవుని ఉద్దేశాన్ని, ప్రయోజనాన్ని మనం తెలిసికోలేం;[59] కాని దేవుడు చేసేది ఏమంటే – దావీదు ఆధారపడిన ప్రతిదానిని ఆయన తొలిగించి (తాను ఆనుకొనియున్న "చంక కఱ్ఱలను" పడవేసి) కేవలం దావీదు తనమీదనే ఆనుకొనునట్లు ఆయన అతనికి నేర్పించు తున్నట్టున్నాడు. దావీదు తన యింటిని, మీకాలు ప్రేమను పోగొట్టుకొనుటకును; సమూయేలును కడసారి అతడు చూడడాన్ని; తన స్నేహితుడైన యోనాతానునుండి కన్నీటితో విడిపోడాన్ని, అతడు దేవుని ప్రత్యక్షగుడారంనుండి దూరమవ్వడాన్ని అనుసరిస్తూ వచ్చాం. అతని దీనాలాపనను కీర్తన. 142లో విన్నాం: "నాయెడల జాలిపడువాడు ఒకడును లేడు" అని అతడన్నాడు (4వ.).

ఏదియెలాగున్నా, కీర్తన. 142లో క్రింది వచనాలు చూడు. 5వ వచనంలో దావీదు యిలా అన్నాడు, "యెహోవా, నీకే నేను మొఱ్ఱపెట్టుచున్నాను నా ఆశ్రయదుర్గము నీవే సజీవులున్న భూమిమీద నా స్వాస్థ్యము నీవే అని నేననుకొంటిని." దావీదు తన బలముయొక్క యితర ఆధారాలను కోల్పోయి ఉండవచ్చు, అయితే అతనికి తన

దేవుడున్నాడు; అతడు తన స్వరాన్ని ఆయనవైపు ఎత్తుతాడు: "నేను చాలా క్రుంగియున్నాను నా మొఱ్ఱకు చెవియొగ్గుము. నన్ను తరుమువారు నాకంటె బలిష్ఠులు వారి చేతిలోనుండి నన్ను విడిపింపుము. నేను నీ నామమునకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించునట్లు చెరసాలలో నుండి నా ప్రాణమును తప్పింపుము" (6, 7ఏ వచనాలు).

ఆ కీర్తనను దావీదు విశ్వాసంతో కూడిన మాటలతో యిలా ముగిస్తున్నాడు: "అప్పుడు నీవు నాకు మహోపకారము చేసియుండుట చూచి నీతిమంతులు నన్నుబట్టి అతిశయ పడుదురు" (7బి వ.). 4వ వచనంలోనేమో ("నా యెడల జాలిపడువాడు ఒకడును లేడు" అని అంటాడు), మరియు 7వ వచనంలోనేమో ("నీతిమంతులు నన్ను బట్టి అతిశయపడుదురు" అని అంటున్నాడు) అనే ఈ మాటలు రెండు వచనాలతోనే వేరుచేయ బడ్డాయి, కాని వాటి భావాలు కోట్లకొలది మైళ్లదూరంలో ఉన్నాయి. తన దేవుడైన యెహోవాయందు విశ్వసించడంలో దావీదు నూతన అంతస్థుకు వెళ్లుతున్నాడు!

ఈ పాఠాలు మనకు ప్రాముఖ్యమైన పాఠాలు – కొన్ని సార్లు మనం ఎంత కఠిన హృదయులమౌతామంటే, మనం వాటిని నేర్చుకోవాలంటే మన జీవితాలకు ఆపదలే రావాలి. కృప కలిగి మనం క్షమించడం నేర్చుకోవాలంటే, ఒకవేళ ఎవరైనా మనలను అవమానపరచినప్పుడే జరుగుతుంది. ప్రియమైనట్టు మనం హత్తుకొని ఉన్నదంతా పోగొట్టుకున్నప్పుడే సంపూర్ణంగా దేవునిమీద ఆనుకొనడానికి నేర్చుకునే ఒకే ఒక మార్గం ఏర్పడుతుంది. లోకంలో సామాన్యుడు తన సర్వస్వాన్ని పోగొట్టుకొంటే, "అంతటిని నేను అంతమొందించుకోవచ్చు"నని అంటాడు. క్రైస్తవుడు సమస్తాన్ని కోల్పోయినప్పుడు, అతడు తన దేవునివైపు చూస్తాడు. మరియు దేవుడు, "నీ చెయ్యి ఖాళీ అయ్యింది? మంచిది! చివరికి నా గొప్ప దీవెనలను పొందడానికి నీవు సిద్ధంగా ఉన్నావు" అని అంటాడు!

చెడు సమయానికి ఎదురు చూడాలని, వాటిని మనం వాంఛించాలని నేను చెప్పడం లేదు. కాని నేను చెప్పేదేమంటే, అవి వచ్చినప్పుడు, వాటి విషయంలో మన వైఖరి ఎంతో వ్యత్యాసాన్ని కలుగజేస్తుంది. ఆ కాలాల్లోనుండి మనం చేదుగాగాని, మేలుగా గాని, చెదరిపోయిగాని రూపుదిద్దబడిగాని రావచ్చు. వాటిపట్ల సద్భావనతో కూడిన వైఖరిని అనుసరించుదాం ఎందుకంటే చెడ్డ కాలాలు వచ్చినప్పుడు, వాటిలోనుండి మేలుకలుగ వచ్చు.

## ముగింపు

నీవు ఎవరివైనా పెద్ద వ్యత్యాసమేమీ లేదు; చెడు కాలాలు రావచ్చు. జ్ఞాపకాలు వరదలా పొర్లుతున్నాయి: ఒక పెద్ద తన మంచంమీద కూర్చుండి, తన వివాహంలో సమస్యలు ఉన్నందున ఏడుస్తున్నాడు; తల్లిదండ్రులు తమ ఎర్రబారిన కన్నులతో వివాహం కాకుండా గర్భవతియైన తమ కుమార్తెను గూర్చి నాతో చెప్పుతున్నారు; స్విమింగ్ పూల్‌లో పడిపోయిన శిశువుయొక్క తల్లిదండ్రులు, ముత్తవ్వలు, స్నేహితులు హాస్పటల్ రూముచుట్టు పోగైయ్యారు; దైవ భక్తిగల క్రైస్తవ స్త్రీ – తన కుమారుడు పురుష సంయోగియైనందుకు

వేదనలో మునిగిపోయింది. మీలో ఎక్కువమంది ఇప్పుడు చెడు సమయంలో ఉన్నవాళ్ళు కావచ్చు. అది వాస్తవమైతే, దావీదుయొక్క అరణ్యపు అనుభవంలోనుండి ఒక పాఠం నేర్చుకోగలవు. మనం మన చేతనైనదంతా చేసి, దేవుని మీద ఆధారపడదాం. అలాగైతే మన బతుకు కొనసాగిస్తాం. అలా దావీదు చేశాడు, మనం కూడా చేయగలం.

---

## ప్రసంగపు నోట్సు

"చెయ్యి," "చెయొద్దు" అనే పది ఈ పాఠంలో ప్రస్తావించబడ్డాయి (నాలుగు మాత్రం క్లుప్తంగా ప్రస్తావించబడ్డాయి). "టాప్ టెన్ లిస్ట్"లోనుండి "క్రిందికి లెక్కవేసి కొంటూరా." "చెడు కాలాల్లో బతుకు కొనసాగించుటకు చేయవలసినవి మరియు చేయకూడనివి" ఈ పద్ధతిని నీవు ఉపయోగించినట్లయితే, లిస్టులో "నెంబర్ వన్" చర్చించిన వాటిలో చివరిదైన దేవుడు కష్టకాలాల్లో సహాయం చేస్తాడనేది వస్తుంది.

ఈ పాఠంలో గుర్తించినట్టే, దావీదు జీవితం కష్ట కాలాలకు కీర్తనలు కొన్ని సంబంధించినై అన్నట్టు చూచాం. వీటిలో చాలా సప్లమెంటరీ సెర్మన్స్ అవుతాయి. *"The Day Christ Came Again"* అనే నా మొదటి సెర్మన్ బుక్‌లో "నా ఆత్మనుగూర్చి లక్ష్య పెట్టువాడొకడును లేదు" అనే పాఠానికి కీర్తన. 142 వర్తిస్తుంది. ఈ ప్రసంగం మొదటి భాగానికి దానినుండి పద ప్రయోగాలు తీసికోబడ్డాయి.

---

సూచనలు

[1]ద్వితీయో. 32:20; కీర్తన. 91:7; మీకా 6:7లను గమనించు. ఒక తల్లి, "నేను నీకు వెయ్యి సార్లు చెప్పాను" మరియు "నేను నీకు కోటి సార్లు చెప్పాను" అని అన్నప్పుడు – ఆ రెండు మార్లు కూడా ఆమె ఒకే సంగతిని చెప్తుతోంది. [2]1 సమూ. 18:12, 15, 29. [3]1 సమూ. 18:17. [4]1 సమూ. 17:25. [5]దావీదు సౌలుకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి యిది ఒక ప్రేరేపణ మాత్రం – సౌలు అతని చంపడానికి అది సాకుగా ఉండేది కాని, అది పని చేయలేదు. [6]ఆది. 34:12; నిర్గమ. 22:16లను చూడు. [7]"సున్నతి చేసుకొనని" ఫిలిష్తీ పురుషులనుండి నూరు ముందోళ్లను తీసికొని రమ్మని సౌలు అడిగాడు (1 సమూ. 18:25). [8]1 సమూ. 19:12, 18; 20:1; 21:10; మొదలైనవి. ఈ కొద్ది అధ్యాయాల్లోనే ఏదోయొక రూపంగా దావీదు పారిపోయెనని పది సార్లు ఉంటుంది. [9]ఏదో ఒక విధంగా ఆ సంగతిని మీకాలు కనుగొంది (1 సమూ. 19:11); అది దావీదు ద్వారానే గాని యింకా వేరొక మార్గంగుండా కాని. [10]ఇల్లు జాగ్రత్తగా కనిపెట్టబడుతోంది (1 సమూ. 19:11).

[11]రాహాబు యింటివలెనే, వీరిది కూడా పట్టణపు గవిని మీద కట్టబడినట్టు సూచిస్తుంది (యెహోషువ 2:15 చూడు). [12]హెబ్రీ.: *teraphim*. సాధారణంగా యిది ఒక విగ్రహాన్ని సూచిస్తోంది. ఆ విధంగా అది NASBలో తర్జుమా చేయబడింది. దావీదు ఇంటివారిలో విగ్రహం చేస్తున్న పని ఏమి? లేఖనం ఏ వివరాలు యివ్వని కారణాన, మనం మూర్ఖంగా ఉండనక్కరలేదు, కాని మీకాలు దానిని తన తండ్రి యింటివద్దనుండి తెచ్చియుండవచ్చు, అది అక్కడ ఉన్నట్టు దావీదుకు తెలియక పోవచ్చు. ప్రాచీన విగ్రహాలు విగ్రహాలులా కన్పించక పోవచ్చు. అది ఒక గది మూలన ఉండే అలంకరణ స్తంభమైయుండవచ్చు. [13]నాయోత్ అంటే, "నివాసము" లేక "నివాస స్థలము" అని అర్థం. ఇక్కడ ప్రవక్తలు నివసించే క్లాంపెక్స్ హౌసెస్ కావచ్చు. [14]"వస్త్ర హీనుడు" అంటే వస్త్రం లేని లేదా "చాలినంత వస్త్రాలు లేకపోవడం" అనేది భావం గనుక, "వస్త్ర హీనుడు" అని చెప్పబడినప్పుడు సౌలు స్థితి ఎట్టిదో మనకు తెలియదు. ఏదియేమైనా, సౌలు తన స్థితిని తాను ఎరిగినప్పుడు దావీదును కనుగొనే దానికంటే తన వస్త్రాలను కనుగొనడానికి సౌలు ఎక్కువ శ్రద్ధ చూపాడని బర్టన్ కఫ్‌మన్ గమనించాడు. [15]1 సమూ. 24:6; వగైరాలు. [16]1 సమూ. 4:2, 3; యిర్మీయా 7:12. [17]అహీమెలెకు ఏలీయొక్క

వంశస్తుడు. సమూయేలు సౌలును విడిచిన తరువాత సౌలుతో చేరిన అహియా యొక్క సహోదరుడైనా యితడు అయ్యుండాలి (1 సమూ. 14:3; 22:9లను పోల్చి చూడు), లేదా, ఇతడే అహియా అయినా అయ్యుండాలి (అంటే, అహీమెలెకుకు అహియా అనేది వేరొక పేరు). ఎటుచూచినా, దావీదు అతని నమ్మలేకున్నాడు. [18]ప్రతి సబ్బాతు దినాన పన్నెండు పెద్ద పులియని రొట్టెలు ప్రత్యక్షగుడారములోని బల్లమీద పెట్టబడేయి (నిర్గమ. 25:23–30; లేవీ. 24:5–9). మరుసటి సబ్బాతు దినాన, పన్నెండు క్రొత్త రొట్టెలు ఈ బల్లమీద పెట్టబడేవి. యాజకులు పాత రొట్టెలను తినేవారు. ఈ పాత రొట్టెలలో కొన్నింటిని యాజకుడు దావీదునకు యిచ్చాడు. ఈ కథను ప్రభువైన యేసు ఉపయోగించి, ప్రాణ రక్షణకొరకు ఎల్లవేళలా మేలు చేయడం మంచిదేననే పాఠాన్ని బోధించాడు (మత్తయి 12:3, 4; లూకా 6:9). నేటికి దాని వర్తింపును ఆలోచించు: (ఆజ్ఞాపింపబడినట్టు – హెబ్రీ. 10:25) ఒకడు ఆరాధనకు వెళ్లుతున్నాడనుకో, కారు పగిలిపోయిన దాని వద్దకు వచ్చాడు, ఆగి గాయపడినవానికి సహాయపడడంలో ఆరాధనను పోగొట్టుకోవచ్చు. అయితే చెడు చేస్తే మంచి వస్తుందని, దీనిని లైసెన్సుగా తీసికోకూడదు. [19]దావీదు బుద్ధి హీనతను, నిజాయితీలేమిని సపోర్టు చేయనవసరం లేదని అర్థం చేసికో. తాను అంగీకరింపని అనేక వాస్తవాలను బైబిలు యిస్తుంది. అబద్ధమాడడాన్ని దేవుడు అంగీకరించడు (1 యోహాను 2:21; యోహాను 8:44). [20]దోయేగు "అక్కడ యెహోవా సన్నిధిని ఉండెను" (1 సమూ. 21:7). ఈ క్రమశిక్షణ చర్య – యాజకుల యెడల దోయేగుకు శతృత్వం కలిగిందో వివరించ సహాయపడుతుంది.

[21]1 సమూ. 17:23. [22]"గాతు రాజైన ఆకీషు"నొద్దకు దావీదు వెళ్లినట్టు గమనించు (1 సమూ. 21:10) "తన యింట ప్రవేశించాలని" కోరినట్లున్నాడు (1 సమూ. 21:15 గమనించు). 1 సమూ. 27:1లో ఈ సమయమందు తన ఆలోచనను ఎరిగే మార్గ మివ్వబడినట్టుంది. [23]1 సమూ. 21:11 "దావీదు ఈ దేశపు రాజు కాడా?" అన్నట్టుంది. ఆ దేశంలోని జనుల హృదయాలను పాలించేవాడని వారి భావన కావచ్చు. నేడు జనులు "రాక్ అండ్ రోల్ రాజు" మొదలగునవి – ప్రభావంగలవి అని. [24]కీర్తన. 56 యొక్క పరిచయపు నోట్సును చూడు. [25]పిచ్చివారుగా నటించి ఇండియన్స్ చేతిలోనుండి అమెరికన్ వెస్ట్ ప్రయాణీకులు ఒకరికంటె ఎక్కువ మంది తప్పించుకున్నారు. [26]కీర్తన. 34 ప్రారంభపు నోట్‌ను చదివి, ఈ కీర్తనయొక్క సందేశాన్ని కూడా చదువు. [27]"గవిని మీద అతడు గీరెను" అని కొన్ని తర్జుమాలు అన్నాయి. గీతలు గీయడానికి దావీదు తన ఖడ్గాన్ని సహా ఉపయోగించియుండవచ్చు. [28]See the Amplified Bible. [29]1 సమూ. 22:1. "అదుల్లాము" అనే పదానికి "ఆశ్రయ స్థానము" అని అర్థం. [30]ఒరిజినల్ అదుల్లాము ఎక్కడ అనే దాని విషయంలో పండితులు వేరైయ్యారు. వర్ణించబడింది ట్రెడిషనల్ లొకేషన్.

[31]Lynn Anderson, "Man on the Run" (N.p., n.d.), sound cassette. [32]తాను పారిపోయేవాడుగా ఉన్నకాలంలో వారు క్షేమంగా ఉండునట్లు దావీదుతన తల్లిదండ్రులను మోయాబుకు తీసికొనిపోయాడు (1 సమూ. 22:3, 4). కుటుంబానికి మోయాబుతో సంబంధాలున్నాయి; దావీదుయొక్క ముత్తవ్వతల్లి మోయాబీయురాలే. సౌలు మోయాబీయులతో యుద్ధం చేశాడు కూడా (1 సమూ. 4:47). సౌలు యొక్క "శత్రువును" మోయాబు రాజు అభిమానంగా చూడవచ్చు. [33]1 సమూ. 30:21. [34]1 సమూ. 30:6 పోల్చి చూడు. [35]బలమైన దుర్గము అనే పదం దావీదు పారిపోవడం తరచుగా ఉపయోగింపబడేది. అది ఒకే స్థలాన్ని సూచించదు, కాని సులువుగా అందుబాటులో లేని ఏ స్థలమైనా. ఈ వచనంలో అది ఆ గుహను సూచిస్తుంది. [36]1 దినవృ. 21:9. [37]1 దినవృ. 29:29. [38]1 సమూ. 21:1–9 దావీదు దేవునియొద్ద విచారణ చేసినట్టు ప్రస్తావించబడలేదు, కాని అతడు చేసియుండవచ్చు (22:15 చూడు). [39]1 సమూ. 22:18, 19. విపత్తులు ముందుగానే చెప్పబడ్డాయి (1 సమూ. 2:31తో పోల్చు). [40]ఇతరులు ఉత్తరువులకు బదులు చెప్పినప్పుడు, "తన క్షేమంకొరకు" అతడు నోబులో నిలిచియుండి ఉండవచ్చు.

[41]మత్తయి 5:23, 24ను గమనించు. [42]అతడు మనలను క్షమించినా క్షమించకపోయినా, మనం చేయగలిగింది మనం చేశాం (రోమా 12:18). [43]ఫిలిష్తీయులు "కళ్లముల మీద పడడంలో" ధాన్యాన్ని దొంగలించుకొనడానికి కావచ్చు. [44]1 సమూ. 23:3 గమనించు: కెయీలాకు వెళ్లడానికి వారు యూదాను విడువవలసి వస్తుంది. [45]1 సమూ. 9:16తో పోల్చు. [46]1 సమూ. 23:13. [47]1 సమూ. 23:6ను ఉపయోగించి, దావీదు కెయీలాకు వచ్చేవరకు దావీదునొద్దకు అబ్యాతారు రాలేదని కొందరంటారు, కాని 6వ వచనాన్నిబట్టి, దావీదు సైన్యం కెయీలాను పట్టుకునేవరకు ఆగి ఆ కార్యం ముగిసిన పిమ్మట అతడు దావీదుతో కలిసికొనియుండవచ్చు. దావీదు యెహోవా యొద్ద విచారణ చేసినవే 2వ వచనంలో జరిగిన దానివంటిదే 9వ వచనంలో జగిగించాడు. [48]1 సమూ. 22:18. [49]నిర్గమ. 28:30. [50]రంగులో తప్ప ఊరీము, తుమ్మీములనేవి

ఒకే విధంగా ఉండవచ్చు–ఒక రాయి "అవును" అనేదానికి, మరొక రాయి "కాదు" అనేదానికి. ప్రశ్నవేయబడిన తరువాత, ప్రధాన యాజకుడు ఒక రాతిని జవాబు యివ్వడానికి లాగేవాడేమో. ఊరీము తుమ్మీములనేవి నునుపుగా చదరముగానుండి ఒకవైపు ఒక రంగు మరోవైపు మరోరంగు కలిగియున్నట్టు చెప్పుతారు. అవి గాలిలో టాస్ చేయబడతాయి అవి నేలను పడిన తరువాత, రెండును ఒకే రంగును సూచించినట్లయితే, అది "అవునని" యిరువైపుల అవి మరియొక రంగును చూపేవైతే, అది "కాదు"; ఒకవేళ రెండు రంగులూ ఒకే సారి చూపించబడడమైతే, ఫలితం అనిశ్చయమని భావిస్తారట. మెరయుట ద్వారా అవి దేవుని చిత్రాన్ని సూచిస్తాయని యూదుల పారంపర్యమంటుంది.

[51]తన జనులయొక్క భయాన్నిబట్టి, వారికి మరల అభయమివ్వడానికి గాను దావీదు ఒకే ప్రశ్నను రెండుమార్లు అడిగాడు. రెండుమార్లు కూడా, వెళ్లుడని దేవుడన్నాడు. [52]యెహోషువ 15:55. [53]ఎవరి ఆస్తిని వారు కాపాడారా, కృతజ్ఞతగల ఆ జనుల బహుకరణల ద్వారా దావీదును అతని జనులును చావకుండ బ్రతికింపబడియుండవచ్చు (1 సమూ. 25:14–16 చూడు). [54]1 సమూ. 23:19, 20. [55]1 సమూ. 26లో జీఫీయులు రెండవసారి దావీదును మోసగించినది కన్పిస్తుంది. [56]1 సమూ. 18:12, 14, 28; 23:2, 4; 25:26, 28నుండి, 34, 39; 26:12, 24; 30:6, 23; వగైరాలు. [57]దావీదు అప్పుడే తన కీర్తనలను రాశాడో, లేక తన మనస్సులో వాటిని కంపోస్ చేసికొని, తరువాత వాటిని రాశాడో మనకు తెలియదు. [58]ఫిలిష్తీయుల దండయాత్ర మీద సౌలు గతంలో అంతగా ఆసక్తి చూపని కారణాన (1 సమూ. 23:1నుండి), ఇది సౌలుకు సొంతమైన ఆస్తిమీద దాడియై ఉండవచ్చు! [59]యెషయా 55:8, 9.